JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । మంగళవారం 28-07-2026
Medchal - Malkajgiri । Tuesday 28-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 57
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 57 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com



## హైడ్రా కమీషనర్ తొలగింపుకు హైకోర్టు ఆదేశం



- హైడ్రా కమీషనర్ పదవినుండి రంగనాథ్ తొలగింపు
- హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు
- హైడ్రా కమీషన్ పనితీరుపై తీవ్ర ప్రభావం

**జయభేరి, హైదరాబాద్ :**

హైడ్రా... తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గట్టిగా వినిపిస్తున్న పేరు. రాజధాని హైదరాబాద్ లో కార్యకలాపాలు సాగించే ఈ ప్రభుత్వ సంస్థ ఇరు తెలుగు రాష్ట్రాల ప్రజల్లోనే కాదు రాజకీయాల్లో పెద్ద చర్చకు కారణమయ్యింది. ఈ హైడ్రా అధికార, ప్రతిపక్షాల ఎన్నికల అస్త్రంగా మారిందంటేనే దీని ప్రభావం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. హైడ్రా ఏర్పాటునుండి ఇప్పటి వరకు చేపట్టిన ప్రతి ఆపరేషన్ వివాదాస్పదమే.. చివరికి తెలంగాణ హైకోర్టు కమీషనర్ రంగనాథ్ ను తొలగింపుకు ఆదేశించే వరకు పరిస్థితి వచ్చింది. హైడ్రాకు సంబంధించిన ఓ వివాదంపై విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు ఘాటుగా స్పందించింది. హైడ్రా కమీషనర్ రంగనాథ్ కు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన న్యాయస్థానం ఈసారి సంచలన ఆదేశాలు జారీ చేసింది. వెంటనే హైడ్రా కమీషనర్ బాధ్యతల నుండి రంగనాథ్ ను తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీని ఆదేశించింది. ఆయన స్థానంలో అన్ని అర్హత కలిగి సమర్థంగా పనిచేసే అధికారిని నియమించాలని హైకోర్టు స్పష్టం చేసింది.

...మిగతాది 2 లో




- జగన్‌కు మోదీ-షా అపాయింట్‌మెంట్ ఇస్తే?
- కూటమిపై ప్రభావం ఎంత?
- ఏపీలో రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయి?
- బిజెపి అగ్రనేతల మాస్టర్ ప్లాన్ ఏంటి?

**జయభేరి, విజయవాడ, జూలై 27 :**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేయబోతున్నట్లుగా ప్రచారం జరుగుతున్న ఢిల్లీ పర్యటన , ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాల అపాయింట్‌మెంట్‌లు ఎప్పుడూ అత్యంత ఆసక్తికరమైన రాజకీయ చర్చలకు దారితీస్తున్నాయి. ఇంత వరకూ అపాయింట్‌మెంట్ ఖరారైనట్లుగా స్పష్టత లేదు కానీ.. భేటీ ఉంటుందని వైఎస్ఆర్‌సీపీ వర్గాలంటున్నాయి. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా.. కేంద్ర పెద్దలకు తమపైనే ప్రత్యేక అభిమానం ఉందనే సంకేతాలను కేడర్‌లోకి పంపడంలో వైఎస్సార్‌సీపీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ వస్తోంది. క్షేత్రస్థాయి ప్రచారంలో టీడీపీ, జనసేనలతో భాజపా కేవలం ఎన్నికల పొత్తు మాత్రమే పెట్టుకుంది, కానీ మోదీషాలకు జగన్ అంటేనే ప్రత్యేక ఇష్టం అనే భావనను నిలబెట్టే ప్రయత్నం నిరంతరం సాగుతుంటుంది. కూటమి ప్రభుత్వంపై ఫిర్యాదు చేసేందుకు జగన్‌కు మోదీషాలు అపాయింట్‌మెంట్ ఇస్తే ఏపీ రాజకీయ సమీకరణాలు ఎలా మారుతాయనేది ఆసక్తికరంగా మారింది.

**మోదీకి దగ్గర అనే భావన పెంచుకుంటున్న వైసీపీ**

వైఎస్సార్‌సీపీ వ్యూహాన్ని లోతుగా పరిశీలిస్తే.. ఢిల్లీలో కేంద్ర పెద్దల భేటీ లభిస్తే దాన్ని వెంటనే కూటమిపై మైండ్ గేమ్ ఆడేందుకు ఉపయోగించుకుంటుంది. తమ నేతపై కేంద్ర దర్యాప్తు సంస్థల కదలికలు మందగించడానికి, కూటమి ప్రభుత్వం పగటిపూట చేసే విచారణలకు కేంద్రం వద్ద మద్దతు లభించడం లేదని నిరూపించడానికి ఈ అపాయింట్‌మెంట్‌ను ఒక రుజువుగా చూపే అవకాశం ఉంది. జగన్ విజ్ఞప్తులను వినడానికి ప్రధాని లేదా హోంశాఖ మంత్రి సమయం కేటాయిస్తే.. చూశారా! కూటమి ఎన్ని ఆరోపణలు చేసినా కేంద్రం జగన్ మాటకే ప్రాధాన్యం ఇస్తోంది అని క్షేత్రస్థాయిలో జోరుగా ప్రచారం చేసుకోవడం ద్వారా సొంత కేడర్‌లో ధైర్యం నూరిపోసేందుకు వైసీపీకి అవకాశం లభిస్తుంది. ఇక కూటమి పరంగా చూస్తే.. ప్రధాని లేదా హోంశాఖ మంత్రి జగన్‌కు ముఖాముఖి సమయం ఇవ్వడం కూటమి శ్రేణుల్లో సాంకేతికంగా కొంత

...మిగతాది 2 లో



## మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు

- ధైర్యంగా ముందుడుగు వేస్తేనే ఏదైనా సాధించగలం
- నారా భువనేశ్వరి

**జయభేరి, కుప్పం :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం నాడు కుప్పంలో పర్యటించారు. పర్యటనలో భాగంగా రామకుప్పం మండలం, పీఎంకే తాండ మహిళలతో నారా భువనేశ్వరి ముఖాముఖి నిర్వహించారు. ముఖాముఖిలో నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో రామకుప్పం మండలంలోని తాండాల్లో తెలుగుదేశం జెండా ఎగిరింది. చంద్రబాబు మొదటిసారి ఎమ్మెల్యే అయినప్పుడు కుప్పం ఎలా ఉందో, ఇప్పుడు ఎలా ఉందో మీ అందరికీ తెలుసు. సీఎం చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. నియోజకవర్గానికి ఒకేసారి 30 పరిశ్రమలు తెచ్చారు. ఈ పరిశ్రమల ద్వారా వేలమందికి ఉపాధి, ఉద్యోగా అవకాశాలు లభిస్తాయని అన్నారు. మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు. ఏదైనా సాధించగల శక్తి మహిళలకు ఉంది. నైపుణ్య శిక్షణ కేంద్రాల ద్వారా మహిళలు శిక్షణ తీసుకుని ఉపాధి అవకాశాలు పొందాలి. ఒకప్పుడు బిజినెస్ అంటే నాకూ తెలీదు. ధైర్యంగా ముందుడుగు వేస్తేనే ఏదైనా సాధించగలం. గతంలో మన కుప్పానికి నీటి

...మిగతాది 2 లో




## 'ఏం చేస్తారో చేయండి.. మా పెద్దిని కాపాడండి'

- డాక్టర్లకు చేతులెత్తి నమస్కరించిన కేసీఆర్

**జయభేరి, హైదరాబాద్ :**

బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుకు గురై.. తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న నేపథ్యంలో పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిని సందర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా వైద్యుల ముందు చేతులెత్తి నమస్కరిస్తూ.. "ఏం చేస్తారో చేయండి.. కానీ మా

...మిగతాది 2 లో



## వాయిదాలతో పోటీ పరీక్షల పార్లమెంట్

- తెర మీదకు అక్రమ మార్గాల సవరణ బిల్లు

**జయభేరి, న్యూఢిల్లీ, జూలై 27 :**

పేపర్ లీక్‌లపై కేంద్రం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా పోటీ పరీక్షల (అక్రమ మార్గాల నిరోధక) సవరణ బిల్లు, 2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ యాంటీ పేపర్ లీక్ బిల్లును అయితే, బిల్లును ప్రవేశపెట్టిన కొద్దిసేపటికే ప్రతిపక్ష ఎంపీల నినాదాలు, గందరగోళం మధ్య లోక్ సభ మళ్లీ వాయిదా వేశారు. దాంతో పేపర్ లీక్ నిరోధక బిల్లుపై చర్చ ఇంకా జరగలేదు.ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ బిల్లును విపక్షాల నినాదాల నడుమ కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ చట్టాన్ని సవరించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని తెలిసిందే. ఇప్పటికే నీట్ పేపర్ లీక్ కు సంబంధించి

...మిగతాది 2 లో



## డ్రగ్స్ మాఫియా అరాచకాలు

- మత్తులో పోలీసులపైకి కారును నడిపిన యువకుడు

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లో డ్రగ్స్ మాఫియాపై నిఘా పెట్టిన పోలీసులపై ఓ నిందితుడు కారుతో దూసుకెళ్లిన ఘటన తీవ్ర కలకలం రేపింది. డ్రగ్స్ మత్తులో ఉన్నట్లు భావిస్తున్న యువకుడు తనను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించిన పోలీసులపై వాహనం ఎక్కించడంతో హెడ్ కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మరో ఇన్‌స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్‌కు కూడా స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అబిడ్స్ ప్రాంతంలో డ్రగ్స్ కొనుగోలు, విక్రయాలు జరుగుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్‌కు విశ్వసనీయ

...మిగతాది 2 లో

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

- కొత్తగా ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్
- మీసేవా ద్వారా 2 రోజుల్లో జారీ

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో ప్రభుత్వ సేవలను మరింత సులభతరం చేయడంతో పాటు కుటుంబ వివరాల ధ్రువీకరణను ఒకే వేదికపైకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో 'ఫ్యామిలీ రిజిస్టర్' విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రతి కుటుంబానికి ఒకే ప్రామాణిక కుటుంబ రికార్డు అందుబాటులోకి రానుంది. రేషన్ కార్డు డేటాను ప్రాతిపదికగా తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సభ్యుల వివరాలను ఒకే రిజిస్టర్‌లో నమోదు చేయనుంది. ఆ తర్వాత మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్, మొబైల్ యాప్ ద్వారా ప్రజలు ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించనున్నారు. దరఖాస్తు చేసిన తర్వాత కేవలం రెండు పని దినాల్లోనే సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని తీసుకురావాలని అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ కొత్త విధానం ద్వారా ప్రభుత్వ పథకాలు, ధ్రువీకరణ పత్రాలు, ఇతర పౌర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం తగ్గనుంది. ఒకే కుటుంబ రికార్డుతో వివిధ ప్రభుత్వ సేవలను పొందే అవకాశం కల్పించడం ద్వారా ప్రజలకు సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## హైడ్రా కమీషనర్ తొలగింపుకు హైకోర్టు ఆదేశం

**హైడ్రా కమీషనర్ ను ఎందుకు తొలగిస్తున్నారు?**

సికింద్రాబాద్ కంటోన్మెంట్ పరిధిలోని లోతుకుంటలో సర్వే నెంబర్ 1,2 గల 40 ఎకరాల భూమికి సంబంధించి వివాదం నడుస్తోంది. ఆర్మీకి సంబంధించిన ఈ భూముల్లోకి హైడ్రా అక్రమంగా ఎంటర్ అవుతోంది అనేది వివాదం. హైడ్రా వ్యవహారతీరుపై తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలయ్యింది... దీనిపై ఇప్పటికే పలుమార్లు విచారణ జరిపిన న్యాయస్థాయం ఆ భూముల్లోకి హైడ్రా అధికారులు వెళ్లకూడదని ఆదేశించింది. అయితే కోర్టు ఆదేశాలను ధిక్కరించి హైడ్రా ఓవరాక్షన్ చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి... అందుకే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఘాటుగా రియాక్ట్ అవుతోంది. ఇప్పటికే హైడ్రా కమీషనర్ రంగనాథ్ ను కోర్టుకు హాజరుకావాల్సిందిగా ఆదేశించింది... అతడి వ్యవహారతీరును తీవ్రంగా తప్పుబట్టింది. తమ ఆదేశాలను దిక్కరిస్తూ ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్న అతడి ఆర్మీ కస్టడీకి అప్పగిస్తామని కూడా హెచ్చరించింది. ఇలా రంగనాథ్ పై ఏకంగా 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలు కావడాన్ని కోర్టు సీరియస్ గా తీసుకుంది... అందుకే అతడిని తొలగించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. చట్టాన్ని ధిక్కరించే వ్యక్తి హైడ్రా వంటి సంస్థకు కమీషనర్ గా ఉండటం సరికాదని... అతడికి తొలగించడం తప్ప మరో మార్గం లేదని తెలంగాణ హైకోర్టు పేర్కొంది.

**హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు**

లోతుకుంట భూముల వ్యవహారంపై విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. న్యాయస్థానం తన తీరుపట్ల ఆగ్రహంగా ఉందని గ్రహించిన హైడ్రా కమీషనర్ క్షమాపణలు కోరుతూ ఓ అఫిడవిట్ దాఖలు చేశారు. తనకు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉందని... కోర్టు ఆదేశాలను ఎక్కడా ధిక్కరించలేదని పేర్కొన్నారు. పిటిషనర్లు అవాస్తవాలతో కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని... హైడ్రా అధికారులు లోతుకుంట భూముల్లోకి వెళ్లలేదని అఫిడవిట్ ద్వారా కోర్టుకు తెలిపారు. అయితే అతడి వాదనను కోర్టు నమ్మలేదు... న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంటే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించింది. వీటిపై ఏం సమాధానం చెబుతారని రంగనాథ్ తరపు న్యాయవాదిని ప్రశ్నించింది. ఇలాంటి అధికారి హైడ్రా కమీషనర్ గా అనర్హుడని పేర్కొన్న న్యాయస్థానం తొలగించక తప్పదని తెలిపింది. ఇందుకోసం తగిన చర్యలు తీసుకోవాలని సీఎస్ ను ఆదేశించింది.

**హైడ్రా కమీషన్ పనితీరుపై తీవ్ర ప్రభావం**

కమీషనర్ రంగనాథ్ తొలగింపు హైడ్రా రోజువారీ కార్యకలాపాలను తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా దాని విశ్వసనీయతపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈ సంస్థ తీసుకున్న అనేక కీలక నిర్ణయాలపై ఇప్పుడు సందేహాలు తలెత్తే అవకాశం ఉంది... ముఖ్యంగా హైదరాబాద్ లో ఆక్రమణల పేరిట చేపట్టిన కూల్చివేతలు, ఇతర నిర్ణయాలపై అనుమానాలు వ్యక్తం అవుతాయి... ప్రజలు సమగ్ర సమీక్షకు డిమాండ్ చేయవచ్చు. ఈ పరిణామం ప్రభుత్వ సంస్థలలో పారదర్శకత, సరైన నియామక ప్రక్రియల ఆవశ్యకతను స్పష్టం చేస్తుంది. ప్రజల్లో ప్రభుత్వ సంస్థలపై విశ్వాసం పెంపొందించడం, హైడ్రా భవిష్యత్తు కార్యాచరణను స్థిరీకరించడం ప్రస్తుతం ఎదురయ్యే అతి పెద్ద సవాళ్లు. నిస్సందేహంగా ఇది హైడ్రా కమీషన్ కు గడ్డు కాలమే.

## ఏం చేస్తారో చేయండి

పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడండి" అని భావోద్వేగంగా విజ్ఞప్తి చేశారు. దాదాపు అరగంట పాటు ఆస్పత్రిలోనే ఉన్న కేసీఆర్.. ఐసీయూలో అందుతున్న చికిత్స వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచస్థాయి వైద్యం అందిస్తున్నామని.. అవసరమైతే విదేశీ నిపుణుల సలహాలు కూడా తీసుకుంటున్నామని యశోద ఆస్పత్రి వైద్య బృందం తెలిపింది. గుండె, ఊపిరితిత్తులు సహా ఇతర అవయవాలు స్పందిస్తున్నప్పటికీ.. మెదడు పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరో 48 గంటలు కీలకమని వివరించింది. యశోద డాక్టర్ల వివరణ తర్వాత మాట్లాడిన కేసీఆర్.. చికిత్స ఖర్చు విషయంలో ఎలాంటి వెనుకంజ వేయబోమని.. పెద్ది సుదర్శన్ రెడ్డిని కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ శాయశక్తులా సహకరిస్తుందని స్పష్టం చేశారు. డాక్టర్ల కృషి, దేవుని దయ, ప్రజల ఆశీర్వాదంతో పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుంటారని కేసీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆ తర్వాత యశోద ఆస్పత్రిలో ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేసీఆర్ వారికి ధైర్యం చెప్పారు. "దేవుడున్నాడు, డాక్టర్లు ఉన్నారు, అన్నీ సవ్యంగానే జరుగుతాయి. ధైర్యంగా ఉండండి" అంటూ వారికి మనోధైర్యం నింపారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్ గౌడ్, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహా బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. కేసీఆర్ ఆస్పత్రికి వస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకోవడంతో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

## డ్రగ్స్ మాఫియా అరాచకాలు

సమాచారం అందింది. దీంతో హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూ) ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అబిడ్స్‌లో నిఘా ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే అబిడ్స్‌లోని పాయల్ ఫుట్‌వేర్ సమీపానికి బెలెనో కారులో వచ్చిన సైఫ్‌కు మరో వ్యక్తి అనుమానాస్పద ప్యాకెట్ అందజేశాడు. వెంటనే పోలీసులు ప్యాకెట్ ఇచ్చిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని, కారులో ఉన్న సైఫ్‌ను బయటకు రావాలని ఆదేశించారు. అయితే కారు ఆపుతున్నట్లు నటించిన సైఫ్ ఒక్కసారిగా రివర్స్‌లో వేగంగా నడిపి పోలీసులపైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో హెడ్ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ కాలిపై నుంచి కారు వెళ్లడంతో ఆయనకు తీవ్ర గాయాలు అయ్యాయి. వైద్యుల పరీక్షల్లో అతడి కాలు విరిగినట్లు నిర్ధారణ కావడంతో సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నిందితుడిని అడ్డుకునే ప్రయత్నంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కానిస్టేబుల్ వంశీధర్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన తర్వాత పరారయ్యేందుకు ప్రయత్నించిన సైఫ్‌ను పోలీసులు వెంటాడి అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో కారుతో పాటు అదుపులోకి తీసుకున్నారు. హుస్సేనీ ఆలం ప్రాంతానికి చెందిన సైఫ్‌పై అబిడ్స్, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం సైఫ్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకుని డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, ప్యాకెట్‌లోని పదార్థం, ఘటనకు సంబంధించిన ఇతర కోణాలపై విచారణ కొనసాగిస్తున్నారు. డ్రగ్స్ మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు.

## తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

సేవల్లో పారదర్శకత పెంచడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ సేవల కోసం వేర్వేరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తుండగా.. ఫ్యామిలీ రిజిస్టర్ అమల్లోకి వచ్చిన తర్వాత ఒకే అధికారిక కుటుంబ రికార్డు ఆధారంగా అనేక సేవలు పొందే వీలు కలగనుంది. త్వరలోనే ఈ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ కొత్త విధానం అమలై ఫ్యామిలీ రిజిస్టర్ అందుబాటులోకి వస్తే ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లు, ఇతర సేవల కోసం పదే పదే కుటుంబ వివరాలు సమర్పించాల్సిన అవసరం ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌లో కుటుంబ పెద్ద పేరుతోపాటు.. అందరు కుటుంబ సభ్యుల వివరాలు, కుటుంబ పెద్దతో వారి సంబంధం, వయసు, పుట్టిన తేదీ, కుటుంబం పూర్తి నివాస చిరునామా కూడా ఉండనున్నాయి.ఇది ఆస్తిపై ఎలాంటి చట్టపరమైన హక్కును, యాజమాన్యాన్ని కల్పించదని.. చట్టబద్ధమైన వారసత్వానికి రుజువుగా కూడా పరిగణించలేమని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా ఈ ఫ్యామిలీ రిజిస్టర్ ఎవరినీ సంక్షేమ పథకాలకు అర్హులుగా చేయదని స్పష్టం చేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ డిజిటల్ సంతకం చేసిన ఫార్మాట్‌లో ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికేట్‌ను ప్రభుత్వం జారీ చేయనుంది.

# రాజకీయంగా ప్రభావం చూపే స్థాయికి సీజేపీ




భారత రాజకీయ చరిత్రలో ఎన్నో చిత్ర విచిత్రమైన ఉద్యమాలు వచ్చాయి గానీ, కాక్రోచ్ జనతా పార్టీ సృష్టించిన రాజకీయ సంచలనం బహుశా మునుపెన్నడూ లేదనడంలో సందేహం లేదు. ధర్మేంద్రప్రధాన్‌ను రాజీనామా చేయించడంలో కీలక పాత్ర పోషించారు. చివరికి కేంద్ర ప్రభుత్వాన్ని మోకాళ్లపైకి తెచ్చింది. మోదీ ప్రభుత్వం ఏకంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. సోషల్ మీడియా మీమ్‌గా పుట్టిన కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి తలొగ్గి కేంద్రం ఒక కేబినెట్ మంత్రిని పదవి నుంచి తప్పించడం అంటే, సీజేపీ డిమాండ్లకు మాత్రమే కాదు.. దాని రాజకీయ ఉనికికి కూడా కేంద్రం స్వయంగా చట్టబద్ధత కల్పించినట్లయింది.కేవలం విద్యార్థి పోరాటాలు, మీమ్‌లు, సోషల్ మీడియా క్యాంపెయిన్లకే పరిమితమైన సీజేపీ, ఇప్పుడు అధికారికంగా రాజకీయ పార్టీగా అవతరిస్తే భారత రాజకీయాలు ఏ విధంగా మారతాయనేది ప్రస్తుతం ఢిల్లీ పొలిటికల్ వర్గాల్లో ఆసక్తికరమైన టాపిక్. గతంలో అన్నా హజారే ఇండియా అగైన్స్ట్ కరప్షన్ ఉద్యమం నుంచి ఉద్భవించిన ఆమ్ ఆద్మీ పార్టీ ఎలాగైతే ఒక రాత్రిలో సాంప్రదాయ రాజకీయాలను కుదిపేసిందో, ఇప్పుడు సీజేపీ కూడా సరిగ్గా అదే తరహా యాంటీఎస్టాబ్లిష్‌మెంట్ ఎనర్జీతో ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యే అవకాశాలు ఉన్నాయి. రాజకీయ ఆశలు లేవని చెబుతున్నారు కానీ.. రేపు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చెప్పడం కష్టం. యువత, ముఖ్యంగా జెన్‌జీ , మిలీనియల్స్ అండగా ఉన్న ఈ పార్టీ పొలిటికల్ ఎంట్రీ.. ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ప్రతిపక్షాలకు సింహస్వప్నంగా మారనుంది.వాస్తవానికి, సీజేపీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వస్తే భయపడాల్సింది అధికార బీజేపీ కంటే కూడా కాంగ్రెస్ , ఆమ్ ఆద్మీ పార్టీలే. ఎందుకంటే, కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, యువత సమస్యలైన నిరుద్యోగం, పేపర్ లీకేజీలు, విద్యావ్యవస్థలోని లోపాలపై పోరాడే విపక్ష స్పేస్ ని ఇన్నాళ్లూ కాంగ్రెస్, ఆప్‌లు ఆక్రమించే ప్రయత్నం చేశాయి. అయితే, రాహుల్ గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ కానీ, వరుస వివాదాల్లో చిక్కుకున్న ఆప్ కానీ సాధించలేని భారీ రాజకీయ విజయాన్ని సీజేపీ సాధించి చూపించింది. దీనివల్ల ప్రతిపక్షాల వైపు ఉండాల్సిన యువతరం డిజిటల్ అటెన్షన్, అర్బన్ ఓటు బ్యాంకు మొత్తం సీజేపీ వైపే మొగ్గు చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.కాంగ్రెస్ విషయానికొస్తే, నగరాల్లోని విద్యాధికులు, యువత ఓట్లను రాబట్టడానికి ఆ పార్టీ ఎంతో కాలంగా పడుతున్న కష్టాలు సీజేపీ ఎంట్రీతో బూడిదలో పోసిన పన్నీరు కానున్నాయి. విద్యార్థుల కోసం తాము క్షేత్రస్థాయిలో ఏమీ చేయలేకపోయామనే భావన ఓటర్లలో బలపడటం కాంగ్రెస్‌కు కోలుకోలేని దెబ్బ. మరోవైపు, తమను తాము విద్యార్థుల, మధ్యతరగతి ప్రతినిధులుగా ప్రొజెక్ట్ చేసుకునే ఆమ్ ఆద్మీ పార్టీ ఉనికికే సీజేపీ పెను సవాలుగా పరిణమించనుంది. ఆప్ పాతబడిపోయిన ఫార్ములా స్థానంలో, సరికొత్త డిజిటల్ టెక్నాలజీ, సోషల్ మీడియా స్ట్రాటజీలతో దూసుకొస్తున్న సీజేపీ, ఢిల్లీ , ఇతర మెట్రో నగరాల్లో ఆప్ ఓట్ బ్యాంక్‌ను ఎసరు పెట్టడం ఖాయం.ఈ సరికొత్త పరిణామం ప్రధాని నరేంద్ర మోదీ మాస్టర్ స్ట్రోక్‌లో భాగమనే విశ్లేషణలు కూడా లేకపోలేదు..

అభిజిత్ దీప్కే ప్రారంభించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న తన తొలి నిరసన కార్యక్రమాన్ని చేపట్టింది.నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీ, పరీక్షల్లో అవకతవకలు, విద్యార్థుల భవిష్యత్తుపై నిరసనకారులు ఆందోళన లేవనెత్తారు. ఆ ఆందోళన ఒక పెద్ద ఉద్యమానికి ఆరంభం మాత్రమేనని అభిజీత్ దీప్కే వ్యాఖ్యానించారు.తమ డిమాండ్లపై ప్రభుత్వం నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో, జూన్ 20న కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరవధిక నిరసనను ప్రారంభించారు.పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకురావడం తదితర డిమాండ్లను కేంద్రం ముందుంచారు.అయితే, 'పార్లమెంట్ మార్చ్'కు సీజేపీ ఎలాంటి అనుమతి కోరలేదని, పోలీసులు అనుమతి ఇవ్వలేదని జులై 19న ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.జులై 20న, వేలాది మంది నిరసనకారులు జంతర్ మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీగా వెళ్లడానికి ప్రయత్నించారు.ఆ సమయంలో గుంపును చెదరగొట్టడానికి పోలీసులు బారికేడ్లు, లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఆ ఘటనలో కొందరు యువకులు, పోలీసులు గాయపడ్డారు. దీంతో, పోలీసుల తీరుపై పలు ప్రశ్నలు తలెత్తాయికొన్ని అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు కూడా దీనిపై ఆందోళన వ్యక్తం చేశాయి.ఆ తర్వాత జులై 21 నుంచి 23 మధ్య, జంతర్ మంతర్ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేశారు, పలు మెట్రో స్టేషన్లను మూసివేశారు.పోలీసుల చర్యలపై ఢిల్లీ హైకోర్టు వివరణ కోరింది.

ఆ తర్వాత కేంద్ర మంత్రులు నిరసన స్థలానికి సమీపంలోని ఒక తటస్థ ప్రదేశంలో సీజేపీ ప్రతినిధులతో చర్చలు ప్రారంభించారు.జులై 24న, సోనమ్ వాంగ్‌చుక్ ప్రభుత్వ హామీల నేపథ్యంలో జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో తన నిరాహార దీక్షను విరమించారు.అయితే, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీజేపీ ప్రకటించింది.డిమాండ్లపై సమాధానం ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం ఒకరోజు వరకు సమయం కోరిందని జులై 24న జరిగిన చర్చల ముగింపులో సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు.జవాబుదారీతనం, పరీక్షా విధానంలో సంస్కరణల డిమాండ్లను స్పష్టంగా చెబుతూనే, ఈ పరిణామాన్ని సీజేపీ ఒక భారీ విజయంగా అభివర్ణించింది"ఇది ప్రజాస్వామ్య విజయం, ఇది శాంతి, ఓర్పు, పట్టుదలకు లభించిన విజయం" అని సోనమ్ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు."ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు, కానీ నీట్ పరీక్ష అక్రమాల కారణంగా ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం అందించాలి, నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి అనే రెండు డిమాండ్లు ఇంకా మిగిలే ఉన్నాయి" అని అభిజిత్ దీప్కే తెలిపారు.

విద్యాశాఖ మంత్రి రాజీనామాను ఆమోదించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం మేము ప్రజాస్వామ్యబద్ధంగా స్పందించాం అనే ఇమేజ్‌ను తెచ్చుకోవడమే కాకుండా, విపక్ష ఓట్లను చీల్చే మరొక కొత్త శక్తిని పరోక్షంగా ప్రోత్సహించినట్లయింది. ప్రతిపక్షాల ఐక్యత నీరుగారిపోతున్న తరుణంలో, ఒక స్వతంత్ర యువజన పార్టీ రూపంలో మూడో శక్తి రావడం వల్ల విపక్ష ఓటు బ్యాంకు ఘోరంగా చీలిపోయి, చివరికి అది అధికార పార్టీకే రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందనే భావన ఉంది. కాక్రోచ్ జనతా పార్టీ రాజకీయ పార్టీగా మారుతుందో లేదో ఎవరికీ తెలియదు. కానీ సాంప్రదాయ రాజకీయ సమీకరణాలు, పాతకాలపు ప్రచార శైలి చెల్లవని, ప్రజల్లోంచి వచ్చిన ఆవేశం సరికొత్త రాజకీయ శక్తులకు జన్మనిస్తుందని ఇది నిరూపించింది. రాబోయే ఎన్నికల్లో సీజేపీ నిజంగానే పార్టీ గుర్తుతో బరిలోకి దిగితే, అది కేవలం విద్యావ్యవస్థలోనే కాదు, దేశ రాజకీయాల్లో కూడా ఒక పెద్ద ప్రక్షాళనకు కారణమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## వాయిదాలతో పోటీ పరీక్షల పార్లమెంట్

ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు కేంద్రం ఆదేశించింది. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసు చర్యకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నినాదాలు చేయడంతో పార్లమెంట్‌లో నేడు సైతం మరోసారి గందరగోళం నెలకొనడంతో అంతకుముందు లోక్‌సభ, రాజ్యసభలు రెండూ మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి. విద్యార్థులపై బలప్రయోగం చేశారు, విచక్షణ లేకుండా పోలీసులు ప్రవర్తించారన్న ఆరోపణలపై జవాబుదారీతనం వహించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు నినాదాలు చేయడంతో, ప్రారంభమైన కొద్దిసేపటికే సభ వాయిదా పడిందిధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం మేరకు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. సభలో విపక్షాల ఆందోళనల మధ్య యాంటీ పేపర్ లీక్ బిల్లు ప్రవేశపెట్టగా దీనిపై సభ్యుల సూచనలు స్వీకరించి చర్చ నిర్వహిస్తామని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. అయితే, ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని చర్చను ఇతర అంశాలతో మళ్లించవద్దని ఆయన సూచించారు.కానీ, ప్రతిపక్షాలు మాత్రం ఈ సవరణ బిల్లును తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లు అనేది శాశ్వత పరిష్కారం కాదని ఆరోపించాయి. విద్యార్థుల నిరసనల నేపథ్యంలో జరిగిన లాఠీచార్జిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. పేపర్ లీక్ ఘటనలతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయం కూడా చర్చకు వచ్చింది.ఈ కొత్త పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు 2026 ప్రకారం.. ఇక పేపర్ లీక్ కేసులపై దర్యాప్తు రెండు నెలల్లోగా పూర్తి చేయాలి. పరీక్షలలో పేపర్ లీక్‌లు లేదా అక్రమ పద్ధతులకు పాల్పడిన వ్యక్తులకు కనీసం ఐదేళ్ల నుంచి గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ. 50 లక్షల వరకు జరిమానా విధించాలని ఈ బిల్లులో పేర్కొన్నారు. సంఘటిత నేరాలకు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకు జరిమానా పడుతుంది.ప్రస్తుతం చట్టాల ప్రకారం..వ్యక్తిగతంగా పేపర్ లీక్‌కు పాల్పడితే 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించవచ్చు. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5 ఏళ్ల నుంచి 10 ఏళ్ల జైలు, రూ. కోటి వరకు జరిమానా విధిస్తారు.బిల్లులోని కొత్త సవరణలకు ఆమోదం లభిస్తే.. తీవ్రమైన కేసుల్లో గరిష్ఠంగా 10 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించే ఛాన్స్ ఉంటుంది. పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచడంతో పాటు పేపర్ లీక్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలనే లక్ష్యంతోనే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టింది.

**ధర్మేంద్రకు ఘన స్వాగతం**

నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన బీజేపీ ఎంపీ ధర్మేంద్ర ప్రధాన్, ఇవాళ తొలిసారి పార్లమెంట్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్డీయే మిత్రపక్షాల నుంచి అనూహ్య రీతిలో ఘన స్వాగతం లభించింది. మరోవైపు విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం జరిగిందంటూ విపక్షాలు పార్లమెంట్ ప్రాంగణంలోనే నిరసనకు దిగాయి. దీంతో పార్లమెంట్‌లో భిన్నమైన వాతావరణం కనిపించింది. ఉదయం ప్రధాన్ పార్లమెంట్ ప్రాంగణంలోకి రాగానే.. మకార్ ద్వార్ వద్ద గుమిగూడిన బీజేపీ, ఎన్డీయే ఎంపీలు 'ధర్మేంద్ర ప్రధాన్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఆయనను గౌరవసూచకంగా లోపలికి తీసుకెళ్లి, సంప్రదాయ టోపీని బహూకరించారు. ఈ క్లిష్ట సమయంలో తమ నేతకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తున్నామని అధికార కూటమి ఈ చర్య ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపింది.ఇదే సమయంలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా నేతృత్వంలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు. నీట్ ఆందోళనల సందర్భంగా జులై 20న విద్యార్థులు చేపట్టిన 'సంసద్ చలో' యాత్రపై పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, 'శిక్షా చోరీ' అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఈ నిరసనలో పాల్గొన్నారు. విద్యార్థులపై పెట్టిన క్రిమినల్ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని వారు కోరారు. విద్యార్థులపై పోలీసుల చర్యల విషయంలో హోంమంత్రి స్పందించే వరకు సభా కార్యకలాపాల్లో పాల్గొనకూడదని విపక్షాలు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాలపై దేశవ్యాప్తంగా విద్యార్థుల నుంచి తీవ్ర నిరసనలు వెల్లువెత్తడంతో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ గందరగోళాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని దేశ వ్యతిరేక శక్తులు లబ్ధి పొందకుండా నిరోధించడానికే తాను తప్పుకుంటున్నట్లు ప్రధాన్ తన రాజీనామా సందర్భంగా పేర్కొన్నారు.

## మహిళలు ఇంటికే పరిమితం కాకూడదు

ఎద్దడి ఉండేది. ముఖ్యమంత్రి చంద్రబాబు కృష్ణాజలాలు తీసుకొచ్చి ఇక్కడి ప్రజల దశాబ్దాల కల నెరవేర్చారు. నదుల అనుసంధానంతో సాగు, తాగు నీరు అందిస్తున్నారు. గత ప్రభుత్వంలో పాలన ఎలా ఉందో మీరంతా చూశారు. కనీసం స్వేచ్ఛగా మాట్లాడుకునే పరిస్థితులు కూడా లేవు. చంద్రబాబు సుపరిపాలన అందిస్తారనే నమ్మకంతో కూటమిని ప్రజలు గెలిపించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టే ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, స్త్రీ శక్తి , అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోంది. పీఎంకే తాండాలో అర్హులందరికీ సంక్షేమం అందుతోంది. పంచాయతీ పరిధిలో రూ.75 లక్షలతో సీసీ రోడ్లు, రూ.30 లక్షలతో రహదారుల నిర్మాణం చేపట్టారు. కమ్యూనిటీ భవనాన్ని కూడా నిర్మించారని అన్నారు. ఈ తాండాలో గోకులం షెడ్ల నిర్మాణానికి రూ.25 లక్షలు మంజూరయ్యాయి. రూ.25 లక్షలతో ఓం శక్తి దేవాలయాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. కావలి మదుగు గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. అనంతరం పీ4 కింద పలువురు విద్యార్థులకు సైకిళ్లు , క్రీడా పరికరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పీ4 కింద అందిన రూ.75 వేల సాయంతో ఓ మహిళ ఏర్పాటు చేసిన కిరాణా షాపును భువనేశ్వరి ప్రారంభించారు.

## మోదీ పేరుతో జగన్ మైండ్ గేమ్

గందరగోళాన్ని సృష్టించే ముప్పు ఉందనేది కొట్టిపారేయలేని నిజం. ముఖ్యంగా టీడీపీ, జనసేన శ్రేణులు సుదీర్ఘ పోరాటం చేసి సాధించిన చారిత్రాత్మక విజయం తర్వాత, వైసీపీ శ్రేణులకు అంతర్గతంగా పొందే ఒక నైతిక విజయం గా ఇది రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. కూటమి ప్రభుత్వం చేపడుతున్న విచారణలు, అరెస్టులపై జగన్ ఇచ్చే వినతిపత్రాలు ఢిల్లీ స్థాయిలో చర్చనీయాంశమైతే, అది కూటమి ఐక్యత , ప్రభుత్వ ఇమేజ్‌పై స్వల్ప ప్రభావం చూపవచ్చనే ఆందోళన స్థానిక నేతల్లో వ్యక్తమవుతుంటుంది.

**కూటమిని బలహీనపరిచేలా బీజేపీ చేయకపోవచ్చు!**

అయితే, ఢిల్లీ రాజకీయాల యంత్రాంగాన్ని డీకోడ్ చేస్తే.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అగ్రనాయకత్వం నరేంద్ర మోదీ, అమిత్ షాలు అంత సులభంగా విపక్షాల ట్రాప్‌లో పడే అవకాశాలు లేవని స్పష్టమవుతోంది. రాజకీయ వ్యూహకర్తగా అమిత్ షా వైఖరి ఎప్పుడూ స్పష్టంగా ఉంటుంది. ప్రాంతీయ పార్టీల అంతర్గత కలహాల్లో దూరి తమ మిత్రపక్షాలకు ఇబ్బంది కలిగించే రాజకీయాలకు వారు దూరంగా ఉంటారు. ప్రస్తుతం ఏపీలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అత్యంత బలమైన మెజారిటీతో, చంద్రబాబు సీఎంగా, పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా సుస్థిర పాలన అందిస్తోంది. ఇటువంటి సమయంలో కూటమి ఐక్యతకు హాని కలిగించే లేదా మిత్రపక్షాల్లో అనుమానాలు రేకెత్తించే సంకేతాలను అధిష్టానం ఇవ్వాలనుకోదు.

**అపాయింట్‌మెంట్ ఉండకపోవచ్చంటున్న కూటమి నేతలు**

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక రాష్ట్రానికి చెందిన ప్రధాన ప్రతిపక్ష నాయకుడు లేదా మాజీ ముఖ్యమంత్రి సమయం కోరినప్పుడు, నిబంధనల ప్రకారం లేదా సాధారణ ప్రోటోకాల్ ప్రకారం వినతిపత్రాలు స్వీకరించడం కేంద్ర మంత్రుల విధి. అయితే, దాన్ని ప్రత్యేక రాజకీయ సంబంధంగా చిత్రీకరించే వైసీపీ ప్రయత్నాలను అటు బీజేపీ జాతీయ వర్గాలు కూడా గమనిస్తూనే ఉన్నాయి. అందుకే ఒకవేళ అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పటికీ, అది కేవలం ప్రజాస్వామ్యబద్ధమైన వినతుల స్వీకరణకే పరిమితమని, ఎన్‌డీయే భాగస్వామ్య పక్షాలైన టీడీపీ, జనసేనలకు ఇచ్చే ప్రాధాన్యతలో ఎలాంటి మార్పూ ఉండదని స్పష్టమైన సంకేతాలను బీజేపీ ఇస్తోంది. మోదీ, షాలు ఇచ్చే సాధారణ అపాయింట్‌మెంట్‌ను రాజకీయ ప్రచారానికి వాడుకోవాలని చూసినప్పటికీ, అది కూటమి పునాదులను కదిలించే స్థాయికి వెళ్లకపోవచ్చని భావిస్తున్నారు. చంద్రబాబు రాజకీయ అనుభవం, పవన్ కళ్యాణ్ బీజేపీతో కొనసాగిస్తున్న దృఢమైన బంధం ముందు జగన్ భేటీలు తాత్కాలిక సంచలనాలకే పరిమితమవుతాయి. ఎన్డీయే కూటమి తన పరిపాలనా ఎజెండాతో ముందుకు సాగుతున్నంత కాలం, ఢిల్లీ భేటీల పేరుతో సాగే పొలిటికల్ మైండ్ గేమ్‌లు ఏపీ అసలు రాజకీయ సమీకరణాలను మార్చలేవని ఎక్కువ మంది భావిస్తున్నారు.

# రామలింగేశ్వరుడికి అభిషేకాలు

- శ్రీలక్ష్మి నరసింహా స్వామి నిత్యరాబడి రూ.20.06 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 27:**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామ లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివుడికి ప్రీతికరమైన రోజు కావడంతో రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

**శ్రీనారసింహుడికి నిత్యపూజలు..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు.



శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా సోమవారం రూ.20,06,344 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.84,300, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,84,300, శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాల ద్వారా రూ.30,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.3,00,150, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,33,500, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.47,348, ప్రసాద విక్రయం ద్వారా రూ.4,37,660, కల్యాణ కట్ట ద్వారా రూ.26,550తో పాటు వివిధ శాఖలు,పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.



## రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

**జయభేరి, అడ్డగూడూరు, జూలై 27 :**

మండల వ్యవసాయ అధికారి పాండురంగ చారి ఆధ్వర్యంలో మండల కేంద్రం లోని రైతు వేదికలో (27 నుండి 29 వరకు) రైతులకు ప్రభుత్వం సూచించిన విధంగా ప్రత్యామ్నాయ పంటలలో భాగంగా కంది విత్తనాలను అందుబాటులో ఉంచడం జరిగిందని అలాగే నానోడి డి ఏ పి అందుబాటులో ఉందని ఈసారి ఎల్ నినో ఉన్నందున రైతులు వరి పంట సాగు తగ్గించాలనీ వర్షాలు లేనందున చెరువులలో, బావులలో, బోరు బావులలో నీటిమట్టం క్రమంగా తగ్గుతుందని వరి పంట ఎండిపోయే ప్రమాదం ఉన్నందున రైతులు ఆలోచన చేసి పంటల సరళి మార్చాలని అన్నారు. దానికి బదులు కందులు, కూరగాయలు, జొన్న, సజ్జలు, ఆముదం సాగు చేసుకోవాలని, భూమిలో ఏ పంట వేయకుండా ఖాళీగా ఉంచవద్దని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ లు అక్షర, రవితేజ, పలు విత్తన డీలర్స్ మరియు రైతులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూతనిచ్చిన రాఘవేంద్ర గౌడ్

- ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం

**జయభేరి, మేడ్చల్, జూలై 27:**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ పట్టణం 297వ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసే కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ఆర్ ఫౌండేషన్ (RR Foundation) అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్వయంగా విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ ఉందని, వారికి అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందితే ఉన్నత స్థాయికి చేరుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, ఆరోగ్యం, సామాజిక సేవా రంగాల్లో భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన వెల్లడించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాఘవేంద్ర గౌడ్ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాలు అందించడం ద్వారా వారి తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని పేర్కొన్నారు. అలాగే విద్యార్థులకు ఇది మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నాం

**జయభేరి, తుర్కపల్లి, జూలై 27 :**

రైతు సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరిస్తున్నామని తాసిల్దార్ రవికుమార్ అన్నారు. సోమవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో గల డిఫామ్ పట్టాలను క్లియర్ చేయడానికి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తులను పంపించినట్లు తెలిపారు. అవి ప్రభుత్వ ఆదేశానుసారం క్లియర్ చేయడం జరుగుతుందని అన్నారు. తాసిల్దార్ కార్యాలయంలో క్లియర్ కానీ సమస్యలను ఆర్డిఓ ,కలెక్టర్ కార్యాలయాలకు పంపిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు మండలంలో రైతు సమస్యలను తహసిల్దార్ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు.

## వర్షా లు సమృద్ధిగా కురవాలని జలాభిషేకం

**యాదగిరిగుట్ట, జులై 27:**

తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో మహిళలు బొడ్రాయి,శ్రీవీరభద్రస్వామికి జలాభిషేకం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు పడక రైతన్నలు,ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఆడి గ్రామ ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. బొడ్రాయి,శ్రీవీరభద్రస్వామికి జలాభిషేకం,బతుకమ్మ కార్యక్రమాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మోదీని గద్దె దించే వరకూ ఉద్యమం ఆగదు

- యాదగిరిగుట్టలో వైకుంఠ ద్వారం నుండి కాంగ్రెస్ భారీ కొవ్వొత్తుల ర్యాలీ
- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో కదం తొక్కిన ప్రజాప్రతినిధులు, యువకులు, విద్యార్థులు, మహిళలు

**జయభేరి, యాదగిరిగుట్ట:**



నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కాంగ్రెస్ పార్టీ యాదగిరిగుట్టలో భగ్గుమంది. సోమవారం ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో యాదగిరిగుట్ట పట్టణంలోని వైకుంఠ ద్వారం నుండి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. మోడీ హటావో..దేశ్ బచావో.. అంటూ నినాదాలు చేశారు. కొవ్వొత్తుల ర్యాలీలో బీర్ల ఐలయ్య మాట్లాడుతూ విద్యార్థులపైన నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని కోరారు. మృతి చెందిన విద్యార్థుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు నరేంద్ర మోడీకి గుణపాఠం చెప్పి ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

రాహుల్ గాంధీని దేశ ప్రధానిగా చేసే వరకు కాంగ్రెస్ ఉద్యమం కొనసాగుతుందని బీర్ల ఐలయ్య ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, యాదగిరిగుట్ట మున్సిపల్ చైర్ పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్, వైస్ చైర్మన్ బరిగె రమ్య, పిఎసిఎస్ చైర్మన్ చీర శ్రీశైలం కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు ముఖ్యర్ల మల్లేష్,మంగ సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలి

- జల్లి శైలజ హరినాథ్
- డిప్యూటీ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతిపత్రం

**జయభేరి, మేడ్చల్, జూలై 27:**



మేడ్చల్ ప్రజలకు ప్రధాన నీటి వనరులైన పెద్ద చెరువు, తుమ్మ చెరువులను ఆక్రమణలు, మురుగునీరు, చెత్తాచెదారం నుంచి రక్షించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆమె ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు మేడ్చల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జల్లి శైలజ హరినాథ్ మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ కోసం పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పెద్ద చెరువు, తుమ్మ చెరువుల్లోకి మురుగునీరు చేరడంతో పాటు చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల నీటి వనరులు కలుషితమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే చెరువుల శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నా, వాటి ఆనుకుని అక్రమ వెంచర్లు వెలుస్తున్నా సంబంధిత శాఖలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి చెరువులను పరిరక్షించాలని ఆమె కోరారు. చెరువుల్లోకి వస్తున్న మురుగునీటిని వెంటనే నిలిపివేయడం, చెత్తాచెదారాన్ని తొలగించడం, శిఖం భూములపై జరిగిన ఆక్రమణలను తొలగించడం, అక్రమ వెంచర్లపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువుల హద్దులను సర్వే చేసి శాశ్వత సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని, చెరువుల పరిరక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. డిమాండ్లపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళనలు, ధర్నాలు, ముట్టడులు నిర్వహించడంతో పాటు అవసరమైతే న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయిస్తామని జల్లి శైలజ హరినాథ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, మాజీ సర్పంచ్ తాళ్లపల్లి మురళీ గుప్త, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు రాగం అర్జున్, బొజ్జ రాఘవ రెడ్డి, కానుకంటి వంశీ విజయ్ వంజరి, మైసరి రాజు వంజరి, సర్వేశ్వర రెడ్డి, బండి విష్ణు, డి. సాయి, సత్యనారాయణ రెడ్డి, దగ్గు రాజు, ధాత్రిక లక్ష్మణ్, చీర్ల సత్యనారాయణ, చెరువుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, బొజ్జ వంశీ రెడ్డి, జకట బాబు రాజు, మహేష్ గౌలికర్, గోపు నాగరాజు, సదామణి నరేందర్, మామిళ్ల నర్సింగ్, అవినాష్ చారి, రతన్ రాథోడ్, ఎన్.ఎస్. గౌడ్, సందీప్ యాదవ్, పురుషోత్తం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్రలో ఉపాధ్యాయుల రెండో విడత శిక్షణ ప్రారంభం

**జయభేరి, దేవరకద్ర :**



మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సోమవారం ఉపాధ్యాయుల రెండో విడత శిక్షణ కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మండల ఎంఈఓ బలరాం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. శిక్షణ కార్యక్రమంలో ఆర్పి లు చెప్పినటువంటి విషయాలను బాగా అవగాహన చేసుకుని ఉపాధ్యాయులందరూ తమ తమ పాఠశాలల్లో విద్యార్థుల పురాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు.

తెలుగులో తరగతి వారిగా సామర్థ్యాల సాధన, అభ్యసన ఫలితాలు ఎలా సాధించాలి, చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఎటువంటి కార్యక్రమాలు చేపట్టాలనే విషయాన్ని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆయన వివరించారు.

అదేవిధంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించిన మ్యాథమెటిక్స్ సబ్జెక్టుకు సంబంధించిన విషయాలు ఆర్పీలు తెలియజేస్తారన్నారు. ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశం రెమిడీయేషన్ గురించి రెమిడీయేషన్ బోధన ఎలా చేయాలి? ఏ విద్యార్థి కోసం ఎప్పుడు నిర్వహించాలి, ఎలా నిర్వహించాలి అనేది చాలా ముఖ్యమన్నారు.

ఈ కార్యక్రమంలో కోయిల్ సాగర్ జడ్పీహెచ్ఎస్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కే.రమేష్‌నాయక్, స్థానిక జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామలింగం, సబ్జెక్టు ఆర్పీలు కే. శంకర్, పవన్ కుమార్, నాగరాజు, రెండు కాంప్లెక్స్ లోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


## యశోద ఆస్పత్రిలో పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్, సీతక్క, మల్లారెడ్డి



**జయభేరి, మేడ్చల్ :**

సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వరంగల్ జిల్లా నర్సంపేట్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) సోమవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకోవడంతో పాటు, సుదర్శన్ రెడ్డితో మాట్లాడి ధైర్యం చెప్పారు. అనంతరం రాష్ట్ర మంత్రి సీతక్క, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కూడా ఆస్పత్రికి చేరుకుని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మండల పార్టీ అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు నవీన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మేడ్చల్ నూతన సీఐ అంజిరెడ్డికి బీజేపీ నాయకుల సన్మానం



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించి, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రజలకు సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు పాతూరి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మున్సిపాలిటీ బీజేపీ ప్రధాన కార్యదర్శి కానుకంటి వంశీ విజయ్ వంజరి, ఉపాధ్యక్షుడు సర్వేశ్వర రెడ్డి, బీజేవైఎం జిల్లా నాయకుడు బొజ్జ రాఘవ రెడ్డి, కార్యదర్శులు సత్యనారాయణ రెడ్డి, డి. సాయి, విష్ణు, కార్యవర్గ సభ్యుడు దగ్గు రాజు, నాయకులు అనిల్, గోపు నాగరాజు, సదామణి నరేందర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లికి ఒడిబియ్యం కార్యక్రమం




**జయభేరి, దేవరకొండ :**

అమ్మవార్లకు ఒడిబియ్యం పోసే కార్యక్రమం కొరకు కొంతమంది మహిళలు ఆలంపల్లి దీపిక ఆధ్వర్యంలో ఒక గ్రూపుగా ఏర్పడి దేవరకొండ పరిసర అమ్మవార్లకు ప్రతినెల ఒడిబియ్యం సమర్పించే కార్యక్రమంలో భాగంగా సూర్యగిరి ఎల్లమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి సమర్పించినారు. ఒడిబియ్యం కార్యక్రమంలో భాగంగా బొంతపల్లి, తెలంగాణ కంచి, చిటుకుల చాముండేశ్వరి, వైకుంటపురం ఆలయాలకు వెళ్లి అందరూ బాగుండాలి దాంట్లో మేముండాలి అని మహిళలు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలంపల్లి దీపిక, పసుపుల ధనలక్ష్మి, గోవిందు జ్యోతి, సముద్రాల సత్య శ్రీవాణి, పందిరి శ్రీదేవి, గుద్దేటి అంజని, అర్థం శ్రీలక్ష్మి, చందా అనురాధ, కర్నాటి రజిత, వీరమల్ల స్వప్న, షీలా స్వప్న, నేలంటి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ పార్టీకి లేదు

■ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :



పాలమూరు ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక అర్హత బి ఆర్ ఎస్ పార్టీకి లేదని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. మీడియాలో హల్చల్ చేయడానికి మాత్రమే అనవసరంగా నిందారోపణలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికారంలో ఉన్నన్ని రోజులు అధికారం అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా దోచుకోవడం,దాచుకోవడానికి మీకు సమయం సరిపోలేదన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు,మంత్రులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ హితవు పలికారు. మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన బి ఆర్ ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలు,మంత్రులు కాంగ్రెస్ పార్టీపై, ప్రజా ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలన్నారు. బి ఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యేల పరిస్థితి చూస్తే జాలేస్తుంది. వాళ్ళు అధికారంలో ఉన్న పది సంవత్సరాలు పాలమూరు జిల్లాకు సంబంధించిన ఇరిగేషన్ ,విద్య, వైద్యం శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేయాలేదు, ఆయా శాఖల అధికారులను ఏనాడూ అడిగిన పాపాన పోలేదన్నారు.

జూరాల ,కోయిల సాగర్ ,శంకర సముద్రం ,భీమా ఫేస్ వన్ ,ఫేస్ టు, కే ఎల్ ఐ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఒక్కరు కూడా ఆనాటి ముఖ్యమంత్రిని అడగలేదు, మీరు అధికారంలో ఉన్నన్ని రోజులు అధికారం అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా,దోచుకోవడం,దాచుకోవడానికి మీకు సమయం సరిపోలేదని ఎద్దేవ చేశారు.ప్రజా ప్రజాపాలన ఏర్పడి 30 నెలల కాలంలో దేవరకద్ర నియోజకవర్గాన్ని కనివిని ఎరుగని రీతిలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాము. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాము ,ప్రజా పాలనలో నిజమైన లబ్ధిదారులకు లబ్ధి చేకూరాలని లక్ష్యంగా మా పాలన కొనసాగుతుంది .మేము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజా పాలన కాంగ్రెస్ పార్టీని బద్నామ్ చేయాలని ఉద్దేశంతో అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారన్నారు. పాలమూరు ముద్దుబిడ్డ తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాకు చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలు చర్చించు కొంటున్నారన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పనులను పూర్తి చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును గత నెలలో సందర్శించి అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారన్నారు. ఈ నెల చివరి వరకు కరివేన వరకు నీళ్లు తీసుకువచ్చే బాధ్యత మాది,కోయిల్ సాగర్ ,జూరాల ,నెట్టెంపాడు,శంకర సముద్రం ,ఎల్ ఐ ప్రాజెక్ట్ ల పెండింగ్ పనులు పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామన్నారు, ఆ లక్ష్యంతో పని చేస్తున్నామని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు. గత 30 నెలల కాలం నుండి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామన్నారు.10 ఏళ్ల కాలంలో మీరు చేయలేని మీకు చేతగాని అభివృద్ధి సంక్షేమాన్ని మేము చేస్తుంటే చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలమూరు జిల్లాకు చేస్తున్న అభివృద్ధికి మీరు కూడా సలహాలు, సూచనలు ఇస్తూ సహకరిస్తే మిమ్మల్ని మేము భాగస్వాములుగా అంగీకరిస్తా మన్నారు. అబద్ధ ప్రచారాలు చేసే మీకు, మీ పార్టీకి భవిష్యత్తు లేదన్నారు. అప్పటి మీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం పూర్తి చేస్తే మీరు కేసీఆర్ ని అడిగి పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయినా, మీ చేతగానితనాన్ని మీ అసమర్థతను చూస్తే జాలేస్తుంది. మీకు మమ్మల్ని విమర్శించిన హక్కు లేదన్నారు.జూరాల నుంచి కోయిల్ సాగర్ నీటిని విడుదల చేయడం జరిగిందన్నారు.ఎప్పటికప్పుడు రైతులకు జవాబుదారితంగా ఉంటూ,కరువు కాలంలో రైతులకు నీళ్లు అందించాలని ఆలోచనలతో ముందుకు వెళుతున్నామన్నారు. రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇస్తున్నాం,ఇది రైతు సంక్షేమాన్ని కోరే ప్రజా ప్రభుత్వం అని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.



## బీజేపీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ కి ఘన సన్మానం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా ఐటీ సెల్ కన్వీనర్‌గా నూతనంగా నియమితులైన జల్దా భాస్కర్ ని స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఘనంగా శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ,సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, పట్టణ బిజెపి కౌన్సిలర్ గుండాల అంజయ్య, బీజేపీ రూరల్ మండల్ అధ్యక్షులు నేనావత్ రాము నాయక్, పార్టీకి చెందిన రాష్ట్ర, జిల్లా, దేవరకొండ పట్టణ నాయకులు పాల్గొని జల్దా భాస్కర్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకురి నరసింహ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, సోషల్ మీడియా మరియు డిజిటల్ వేదికల ద్వారా భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు జల్దా భాస్కర్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆయనకు పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని కోరుతూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణదాసు చండీశ్వర్, రెడ్డి శంకర్, సముద్రాల సహదేవుడు, చిలక రాజు బిక్కు, అంజి నాయక్, కాసుల శంకరయ్య, ఇడం రవికుమార్, గంజి హరి, చిత్రం ఉదయ్, జూలూరు శ్రీను , అవ్వారి శేఖర్, జయరామ్ నాయక్, రవి నాయక్, బాలస్వామి, రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ పటిష్టతకు పార్టీ నాయకులు కృషి చేయాలి


■ ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి



జయభేరి, దేవరకద్ర :

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా ఉండి సమిష్టిగా పాటుపడాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సోదరుడు జి.భాస్కర్ రెడ్డి సూచించారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్న చింతకుంట మండలం దమగ్నాపూర్ లో సోమవారం లాల్ కోట, బండర్ పల్లి గ్రామాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే సోదరుడు భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలన్నారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు రానున్న కార్యక్రమాలపై ఈ సందర్భంగా నాయకులతో ఆయన విస్తృతంగా చర్చించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని భాస్కర్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల ఆశయాలను అందరూ సమిష్టిగా కృషిచేసి నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కే. వెంకటేష్ యాదవ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## భూ రీసర్వే తక్షణమే ఆపాలని జిల్లా కలెక్టర్కు అర్జిల్లి అప్పలరాజు వినతి



జయభేరి, పరవాడ:

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం చీపురుపల్లి తూర్పు రెవిన్యూ ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీలో భూ రీ సర్వేను తక్షణమే ఆపాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్కు సోమవారం ప్రజా పిర్యాదుల వేదిక లో ఆంధ్ర ప్రదేశ్ ఆర్టిఐ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ, ఆంధ్రా మత్స్యకార జేఏసీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జన సేన పార్టీ నాయకుడు అర్జిల్లి అప్పలరాజు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా అర్జిల్లి అప్పలరాజు జిల్లా కలెక్టర్ ప్రాంగణంలో మాట్లాడుతూ ముత్యాలమ్మ పాలెం గ్రామ పంచాయతీలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలను మంచి నీటి బావులను ప్రభుత్వ తుఫాన్ రక్షిత భవనాలు మత్స్యకార శుద్ధి కేంద్రాలను పంచాయతీ కార్యాలయంను ప్రైవేట్ వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకొని జీరాయితి భూమిలుగా చూపిస్తున్నారని ప్రభుత్వ భూములు ఆస్తులను పాస్ బుక్ల్లో ఎక్కించుకోవడానికి పరవాడ మండలం రెవెన్యూ అధికారులు ఎలా అనుమతి ఇస్తారని ఆరోపణ చేసారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని వాటిని ప్రవేట్ వ్యక్తులు వారివిగా చెప్పుతున్నారని అన్నారు. వీటికి సంబంధించిన సర్వే నెంబర్లు, ఆధారాలు అన్నీ కూడా జిల్లా అధికారులకి ఇవ్వడం జరిగిందని అన్నారు.ఇదే విషయంపై మండల ఎంఆర్వోకి లేఖ ద్వారా తెలియజేయ్యడం జరిగింది అన్నారు.వీటిపై సమగ్ర విచారణ చేపట్టాలని అర్జీలి కోరారు.

## తమ్మినేని సీతారాం కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

జయభేరి, అమరావతి :

వైసీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమ్మినేని కుమారుడు నాగుకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఫోర్జరీ దస్త్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్కు పాల్పడిన కేసులో నాగు ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేసింది. ఇదే కేసులో తమ్మినేని సీతారాం సతీమణి వాణికి హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు రావాలని తమ్మినేని వాణికి ఏపీ హైకోర్టు ఆదేశించింది.

## పరుగుల తల్లి ప్రవళికకు ఘనంగా సత్కారం

జయభేరి, దేవరకొండ :




దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు నారీమల్ల ప్రవళిక 1207, 2026 నాడు చైనాలో జరిగిన ఆసియా అండర్ 23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్ లో 4 ఐ 400 మీటర్ల మహిళల రిలే లో ప్రవళిక కు స్వర్ణం సాధించిన సందర్భంగా అధ్యక్షుడు NVT సభ్యులతో కలిసి తాను సాధించిన స్వర్ణ పథకాన్ని మెడలో వేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక బీద కుటుంబం నుండి పట్టుదలతో నిరంతర కృషితో భారతదేశానికి స్వర్ణ పథకం అందించిన నారీమల్ల ప్రవళిక నేటి యువతకు ఒక స్ఫూర్తి అన్నారు. చదువులో కూడా ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా మొదటి ర్యాంకులో ఉండడం కూడా గొప్ప విషయమని, తల్లిదండ్రులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా తమ బిడ్డని ఎంతో ప్రోత్సహించి భారతదేశానికి అందించినారని, ఇలాంటి క్రీడా రత్నాలు ఎంతోమంది దేవరకొండ నియోజకవర్గం లో ఉన్నారని, వారికి క్రీడా స్థలాలు లేకపోవడం దురదృష్టకరమని, ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు అందుబాటులోకి వస్తే ఎంతోమంది క్రీడాకారులు మన భారతదేశానికి ఆడతారని, దేవరకొండ నియోజకవర్గంకి గొప్ప పేరు వస్తుందని, అలాగే యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా దూరంగా ఉంటారని , ప్రవళిక లాంటి క్రీడాకారులు ఎంతోమంది తయారు అవుతారని అన్నారు. అందుకని దయచేసి ప్రజా ప్రతినిధులు కానీ అధికారులు కానీ క్రీడాకారులపై దయవుంచి స్టేడియాల అందుబాటులోకి వచ్చే విధంగా చూడాలని ఈ సందర్భంగా అన్నారు. 12 సంవత్సరాల నుండి దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ స్టేడియాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నదని అన్నారు. కోచ్ పరశురాముని కూడా అభినందించినారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్, వైయస్ కరుణాకర్, శైలేష్ వల్లమల్ల ఆంజనేయులు, సన్నీ, కౌన్సిలర్స్ పొట్ట మురళి, సాయి చంద్ర గౌడ్ ,కరాటే మాస్టర్ గోపి, రాజు, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ జాంగిర్ మరియు విద్యార్థులు. వివేకానంద ఒకేషనల్ కాలేజ్ రోజా, లావణ్య, అంజలి, విద్యార్థులు. శివ ,సందీప్, శివకుమార్, వినయ్, యశ్వంత్, ఉదయ్, శ్రీను, సురేందర్, హనుమంత్, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదన సిద్ధం చేయండి..!

■ అధికారులకు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :



దేవరకద్ర నియోజకవర్గంలో భవనాలు లేని ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు నూతన ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అధికారులను ఆదేశించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని మూడ కార్యాలయంలో సోమవారం పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ, డిఈ తదితర అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి తగు సూచనలు, సలహాలను ఎమ్మెల్యే జిఎంఆర్ అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ భవనాలు లేని గ్రామాలను గుర్తించి నూతన భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సంబంధిత అధికారులు ఆదేశించారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేని గ్రామాలను గుర్తించి నూతన పిహెచ్ సి భవనాల ఏర్పాటు కోసం కూడా ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. అంతేకాకుండా ఆహార ధాన్యాల నిల్వ కేంద్రాలు, మహిళా సంఘాల భవనాలు, నూతన ఈవో బిల్డింగ్ నిర్మాణాలు, అంగన్ వాడి భవనాలు లేని వాటికి నూతన భవనాలు నిర్మించడానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అలాగే రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు, తండాలకు రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పురోగతిని ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యే జిఎంఆర్ అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## విద్యార్థిని శివాని మృతి తీవ్ర విచారం కలిగించింది

■ ముఖ్యమంత్రి చంద్రబాబు

జయభేరి, పోలవరం :



పోలవరం జిల్లా ఈర్లపల్లికి చెందిన 10వ తరగతి విద్యార్థిని ముర్రం శివాని తనువు చాలించడం నన్ను తీవ్ర విషాదంలోకి నెట్టేసింది. రంపచోడవరంలో మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ లో వేదికపై ఎంతో ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించింది. ఆ రోజు తన చదువు, ఉన్నత లక్ష్యాల గురించి శివాని నాతో చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్ ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏవైనా తన కలలు నిజం కాకుండానే ఆ విద్యార్థిని దూరమవ్వడం నన్ను కలిచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవ్వరూ ఒత్తిడికి, నిరాశ, నిస్పృహలకు లోను కావొద్దని కోరుతున్నాను. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధను, ఆవేదనను మీ కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, ఆత్మీయులతో పంచుకోండి. ఒత్తిడిని, అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్ని విధాలుగా మీకు అండగా ఉంటుందని తెలియజేస్తున్నాము.



## కోయిల్ సాగర్ కు కృష్ణా జలాల విడుదల

■ ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు ఉంద్యాల పంప్ హౌస్ నుండి కోయిల్ సాగర్ కు నీటి విడుదల

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని వర ప్రదాయని, భారీ నీటిపారుదల ప్రాజెక్టు కోయిల్ సాగర్ కు చిన్నచింతకుంట మండలం ఉంద్యాల నుండి కృష్ణా జలాలను సోమవారం విడుదల చేశారు. జూరాలకు వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ఆదేశానుసారం కోయిల్ సాగర్ కు కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిన్నచింతకుంట మండలం ఉంద్యాల లో ఉన్న పంప్ హౌస్ స్టేజ్ 1 నుండి కోయిల్ సాగర్ కు ఈ నీటిని విడుదల చేశారు. దీంతో కోయిల్ సాగర్ వైపు కృష్ణా జలాల పరుగులు తీస్తున్నాయి. మంగళవారం ఈ కృష్ణా జలాలు కోయిల్ సాగర్ కు చేరే అవకాశం ఉంది. దీంతో కోయిల్ సాగర్ ప్రాజెక్టు రైతులు ఆనందం వ్యక్తపరుస్తున్నారు. ఎమ్మెల్యే జిఎంఆర్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఇంటి ఇంటికి టిడిపి కార్యక్రమం ప్రారంభించిన వియ్యపు



జయభేరి, పరవాడ:

పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా డోర్ టు డోర్ కార్యక్రమాన్ని మండల తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్నా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలను ఆప్యాయంగా కలుసుకుని గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ప్రజలు చెప్పిన సమస్యలు, సూచనలు తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు ప్రతి బూత్ పరిధిలో ప్రతిరోజూ కనీసం 50 కుటుంబాలను సందర్శించి వారి వివరాలను మై టిడిపి యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఒమ్మి వెంకటరావు, పిల్లాఅప్పారావు,నరసింహాలు,రావాడ నాయుడు ,కనక నాగేశ్వరరావు, వడ్డాది గణేష్, బోణి రాంబాబు, నారాపిన్ని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మా, పరిశ్రమలలో కార్మికులకు వేతనాలు పెంచాలి

- జూలై 30న చలో కలెక్టరేట్ జయప్రదం చేయండి
- ప్రచార జాతను ప్రారంభించిన సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు

**జయభేరి, పరవాడ:**

జిల్లాలో వివిధ ఫార్మా, కెమికల్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంపుదల చేయాలని, భద్రత కల్పించాలని కోరుతూ సోమవారం లంకెల పాలెం లో సిఐటియు ప్రచార జాతర జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు ప్రారంభించారు. పరవాడ ఫార్మసిటీలోనూ జిల్లాలో వివిధ ఫార్మా, కెమికల్ కంపెనీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు ఇతర ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాల పెంపు జీవోను సవరించకపోవడంతో ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు.



షెడ్యూల్డ్ పరిశ్రమల్లో ప్రతి ఐదేళ్లకు పెంచాల్సిన వేతనాల పెంపు జీవోను 15 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వాలు అధికారంలో ఉన్న జీవోను సవరించకపోవడం దుర్మార్గం అన్నారు.

దీంతో కొన్ని యాజమాన్యాలు వి డి ఏ పాయింట్లు మేరకు పెంపుదల చేసి చేతులు దులుపుకుంటున్నాయని అన్నారు. 15 ఏళ్లుగా వేతనాల జీవోను సవరించకపోవడంతో ఒక్కొక్క కార్మికుడు కనీసం నెలకు పదివేల రూపాయలను నష్ట పోతున్నారని ఇది కార్మికుల కష్టాన్ని దోచుకోవడమేనని అన్నారు. ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికుల వేతనాల పెంపు జీవోకై ఈ నెల 30న చలో కలెక్టరేట్ నిర్వహిస్తున్నామని దీనిలో ఫార్మా, కెమికల్ కంపెనీ లలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరణం వెంకట్రావు, రామకృష్ణ, అప్పారావు, సత్తిబాబు, రాజు, తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైలం మల్లన్న సన్నిధిలో దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్

**జయభేరి, దేవరకద్ర :**

శ్రీశైలం మల్లికార్జున స్వామి వారిని సోమవారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తమ కుటుంబ సమేతంగా కలిసి వెళ్లి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ జరిగిన పలు పూజా కార్యక్రమాలలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. అలాగే జ్యోతిర్లింగాలను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ కుటుంబ సభ్యులపై పురోహితులు అక్షింతలు ఆశీర్వచనం పలికారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



## శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ టెలిఫోన్ కాలనీలో మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలకు మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి రాగిడి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, జావీద్ ఖాన్, ఆకుల మధుకర్, యూత్ అధ్యక్షులు ప్రభు, ఘట్కేసర్ అధ్యక్షులు బండారు శ్రీనివాస్ గౌడ్, పోచారం మాజీ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, సామల సందీప్ రెడ్డి, సామల మనోహర్ రెడ్డి, ఉప్పరి విజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీ రేణుకా ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించి, ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు.

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చనిపోయిన నీట్ విద్యార్థులకు నివాళిగా క్యాండిల్ ర్యాలీ



**జయభేరి, మేడిపల్లి :**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్, బోడుప్పల్ 10, సర్కిల్ పరిధిలో పిర్జాదిగూడ డివిజన్ ఉప్పల్ బస్ డిపో ఎదురుగా వరంగల్ హైవే పై మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో, తెలంగాణ రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపు మేరకు ఇటీవల ప్రాణాలు కోల్పోయిన నీట్ విద్యార్థుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ బోడుప్పల్ కమాన్ నుంచి ఉప్పల్ బస్ డిపో వరకు ఘనంగా క్యాండిల్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ, విద్యార్థుల మరణాలు అత్యంత బాధాకరమని, ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ క్యాండిళ్లు వెలిగించి రెండు నిమిషాల మౌనం పాటించారు. అలాగే చనిపోయిన నీట్ విద్యార్థులకు ఒక్కొక్కకి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు బీసీ సంఘం జిల్లా నాయకులు బాపురాజు, బి కే ఎం యు మండల కార్యదర్శి మరియు అధ్యక్షులు కే మహాలక్ష్మి & భూతం ఐలయ్య సిపిఐ పార్టీ నాయకులు ఇస్తారి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్కప్లో భారత్కు స్వర్ణం..

**జయభేరి, న్యూఢిల్లీ :**

హాంగ్జౌలో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్కప్లో భారత షూటర్లు మరోసారి తమ ప్రతిభను చాటారు. మహిళల 25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుని దేశానికి గర్వకారణంగా నిలిచింది. అదే విభాగంలో మరో భారత షూటర్ మను భాకర్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఒకే విభాగంలో భారత్కు స్వర్ణం, కాంస్యం దక్కడం భారత షూటింగ్ జట్టుకు మరో విశేష విజయంగా నిలిచింది. ఈ విజయంతో అంతర్జాతీయ వేదికపై భారత షూటర్ల ఆధిపత్యం మరోసారి రుజువైంది.

# పరవాడ సర్పంచ్ ఎన్నికల రేసులో టీడీపీ యువనేత చంద్రశేఖర్

- పార్టీ పూర్తి మద్దతు తనకేనని పత్రిక ప్రకటన ద్వారా తెలిపిన వర్రీ

**జయభేరి, పరవాడ:**



ఆంధ్రప్రదేశ్లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పరవాడ పంచాయతీ నుంచి టీడీపీ సర్పంచ్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్ (బీఎస్సీ, ఎంబీఏ) పోటీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామ ప్రజల ఆశీస్సులు, పార్టీ అధిష్ఠానం, స్థానిక నాయకులు, యువత పూర్తి మద్దతుతో చంద్రశేఖర్ ఈ నిర్ణయం తీసుకొనట్టు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుండి గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి, యువతకి ఉన్నత విద్యా బోధన నేర్పిచడం వంటివి చేస్తున్న చంద్రశేఖర్ అభ్యర్థిత్వానికి స్థానిక టీడీపీ కేడర్, సీనియర్ నాయకుల నుండి పూర్తి మద్దతు లభిస్తోంది. ఈ సందర్భంగా వర్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పరవాడ పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దడమే నా ప్రధాన లక్ష్యం అని గ్రామంలోని ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తానని అన్నారు. పంచాయతీ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి యువత అంతా ముందుకు రావాలి అని పిలుపునిచ్చారు. మౌలిక వసతులు విషయంలో పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కి ప్రణాళిక సిద్ధం చేసుకొనట్టు చంద్రశేఖర్ తెలిపారు. గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరవేరేలా ముమ్మర ప్రచారం చేస్తున్నట్టు గ్రామాభివృద్ధిలో యువత పాత్రను పెంచడం గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆశీస్సులతో పరవాడ అభివృద్ధికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు.

# భూ వివాదంపై ఆర్డీఓకు బొంది ఫిర్యాదు

- 70 ఏళ్లుగా వినియోగంలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలపై సమగ్ర విచారణ కోరిన గ్రామస్తులు

**జయభేరి, పరవాడ:**





అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని దిబ్బపాలెంలో భూ వివాదం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన బొంది అచ్చయ్యతో పాటు పలువురు గ్రామస్తులు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి కి వినతిపత్రం సమర్పించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ముత్యాలమ్మపాలెం శివారులోని సుమారు 27 ఎకరాల భూమిని గ్రామస్తులు గత 70 ఏళ్లుగా వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల రీసర్వే పేరుతో కొందరు వ్యక్తులు భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడంతో గ్రామస్తులు కలిసి సర్వేను నిలిపివేశారని పేర్కొన్నారు. అదే సమయంలో సంబంధిత భూమిపై కొంతమంది ప్రైవేట్ వ్యక్తుల పేర్లతో భూ హక్కులు నమోదై ఉన్నాయని, చట్టబద్ధమైన యజమానులు నిబంధనల ప్రకారం వచ్చి సర్వే నిర్వహించి భూమిని స్వాధీనం చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. అయితే కొందరు స్థానిక దళారులు ఓ రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఆయన అనుచరులు కలిసి గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తూ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా వివాదాస్పద భూమిలో కొంత భాగాన్ని ఇప్పటికే విక్రయించినట్లు కూడా ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ నిర్వహించి వాస్తవాలను వెలికితీయడంతో పాటు అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారిను కోరారు.

# గ్రామ కంఠం నివాసితులకు రెవెన్యూ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ను కలిసిన డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

**జయభేరి, మేడ్చల్ :**



మల్కాజ్గిరి కార్పొరేషన్ కీసర సర్కిల్లోని చంద్రపురి కాలనీ డివిజన్, జవహర్ నగర్ డివిజన్ పరిధిలో గ్రామ కంఠం భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్న ప్రజలకు రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ జిల్లా కలెక్టర్ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ని కలిసి, గ్రామ కంఠం ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న కుటుంబాలు అధికార పరమైన సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని కోరారు. ప్రజల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కి వివరించారు. ప్రజల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజలకు ఎలాంటి అన్యాయం జరగకుండా నిరంతరం వారి తరఫున పోరాడుతామని తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షులు శాంతి కోటేశ్వర్ గౌడ్, జిల్లా నాయకులు కల్లేపల్లి సదానంద్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు ముదిరాజ్, సీనియర్ నాయకులు రజిత గోపాల్, వినయ్ కుమార్, ప్రేమల శ్రీనివాస్, జి. కృష్ణ గౌడ్ , గండి సునీత, లత, జోగీ సునీత, భాస్కర్, సాయి కృష్ణ, మాధవ రెడ్డి, శ్రీనివాస్, తో పాటు తదితరులు పాల్గొన్నారు.



## భక్తులకు అన్నదాన వితరణ



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లోని శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానంలో సోమవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయంలో గత కొన్నేళ్లుగా ప్రతి సోమవారం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే స్థానిక బిలకంటి రాఘవేంద్ర, బిలకటి మాధవి దంపతులతో పాటు గాయత్రీ, వైష్ణవి భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శివానంద చారి లతోపాటు దేవస్థానం అర్చకులు, అన్నదాన వితరణ నిర్వాహకులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల కేంద్రంలోని ఓల్డ్ బజార్ కు చెందిన కటికే బలరాం సోమవారం మృతి చెందారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ మృతుడి ఇంటికి వెళ్లి మృతుడి పార్థివ దేహం పై పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని ఇచ్చారు.

## బాణవత్ బంకట్ లాల్ మృతి చాల బాధాకరం కేతావత్ భిల్యా నాయక్



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండల పరిధిలోని ప్రశాంత పూరి తండా గ్రామ పరిధిలోని హరిచంద్రుతండా కు చెందిన బాణవత్ బంకట్ లాల్ మృతి చెందిన విషయం తెలుసుకొని వారి నివాసానికి చేరుకోని బంకట్ లాల్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్. ఈ కార్యక్రమంలో సేవ్య నాయక్,రాంజి ఇస్లావత్,లాలు,కేతావత్ కిషన్ నాయక్,మోతిరాం నాయక్, నర్సింహ నాయక్,మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాకీతో పాత నేరస్తుడు హల్ చల్

**జయభేరి, హైదరాబాద్ :**

సరూర్ నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో పాత నేరస్తుడు తుపాకీతో హల్చల్ చేయడం కలకలం రేపింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ కంట్రీ మేడ్ పిస్టల్తో సంచరిస్తున్న ఓ వ్యక్తిని మల్కాజిగిరి ఎస్వోటీ పోలీసులు, సరూర్నగర్ పోలీసులతో కలిసి అరెస్టు చేయడం జరిగింది. సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్సింగ్ నగర్లో కంట్రీ మేడ్ పిస్టల్తో తిరుగుతూ స్థానికులను భయపెడుతున్న మొహమ్మద్ ఇమ్రాన్ అలియాస్ ఇబ్బు (22)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. శంకర్నగర్ లో వుంటున్నాడు. నిందితుడి వద్ద నుంచి ఒక కంట్రీ మేడ్ పిస్టల్తో పాటు ఒక లైవ్ రౌండ్ను పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, ఇమ్రాన్ పాత నేరస్తుడని, ఎల్బీ నగర్ జోన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో ఆస్తి నేరాలకు సంబంధించిన అనేక కేసుల్లో అతను నిందితుడిగా ఉన్నాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం ఆయుధాలతో సంచరించిన ఘటనపై కేసు నమోదు చేసి, ఆయుధం ఎక్కడి నుంచి వచ్చింది, ఏ ఉద్దేశంతో వెంట తీసుకెళ్తున్నాడనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ఓటీటీలోకి 'లెనిన్'!



2015లో అఖిల్ సినిమాతో హీరోగా ఎంట్రీ ఇచ్చాడు అక్కినేని అఖిల్. ఇందులో అతని యాక్టింగ్ కు మార్కులు పడినా సినిమా ఆడలేదు. ఆ తర్వాత కూడా అఖిల్ చాలా సినిమాలు చేసినా సాలిడ్ సక్సెస్ రాలేదు. అయితే లెనిన్ సినిమా రూపంలో ఎట్టకేలకు ఓ మంచి విజయాన్ని అందుకున్నాడు అఖిల్. జులై 10న విడుదలైన ఈ ప్రేమకథా చిత్రం అఖిల్ కు మర్చిపోలేని విజయాన్ని అందించింది. మొదటి షో నుంచే పాజిటివ్ టాక్ అందుకున్న లెనిన్ ఆ తర్వాత బాక్సాఫీస్ వద్ద సాలిడ్ కలెక్షన్లు రాబట్టింది. మొదటి మూడు రోజుల్లోనే రూ. 50 కోట్ల క్లబ్ లో చేరిన లెనిన్ ఇప్పటివరకు సుమారు రూ. 90 కోట్ల వరకు రాబట్టిందని ట్రేడ్ నిపుణులు చెబుతున్నారు. సుమారు రూ. 45 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కిన ఈ సినిమాకు ఇప్పటికే భారీగా లాభాలు వచ్చాయని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఓటీటీలోనూ అఖిల్ సినిమాను చూడాలని చాలా మంది ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో లెనిన్ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ పై ఒక ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. అఖిల్ లెనిన్ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5 సొంతం చేసుకుంది. ఇందుకోసం చిత్ర నిర్మాతలకు రూ. 40 కోట్లు చెల్లించిందని సమాచారం. ప్రస్తుతమున్న ఓటీటీ నిబంధనల ప్రకారం థియేట్రికల్ రిలీజ్ తర్వాత 4 నుంచి 8 వారాల విరామం తర్వాతే ఓటీటీలోకి సినిమా రావాలి. ఈ లెక్కన చూసుకుంటే, ఆగస్టు రెండో వారం (ఆగస్టు 14) నాటికి లెనిన్ సినిమా ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చే అవకాశం ఉంది. త్వరలోనే దీనిపై ఒక అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ఇక లెనిన్ సినిమా విషయానికి వస్తే.. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్ఎల్‌పి, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు.



# నిను మళ్లీ గీసిందెవరమ్మా..

దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డే జంటగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'శ్రీశ్రీ'. రవి నెలకుదిటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. త్వరలో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సోమవారం మ్యూజికల్ జర్నీని ప్రారంభిస్తూ 'బొమ్మ బొమ్మ' అనే పాటను విడుదల చేశారు. జీవీ ప్రకాష్‌కుమార్ స్వరపరచిన ఈ పాటను అనంతశ్రీరామ్ రచించారు. 'బొమ్మ బొమ్మ..నిను మళ్లీ గీసిందెవరమ్మా..బంగారంలో మరి ముంచి తీసిందెపుడమ్మా.. అడుగూ అడుగూ నువు నడిచెల్లేటి దారంతా..' అంటూ మెలోడీ ప్రధానంగా ఈ పాట సాగింది. ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇదని, ఆహ్లాదభరితమైన ప్రేమకథగా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, రచనదర్శకత్వం: రవి నెలకుదిటి.

# ఎన్టీఆర్‌కు గాయం




అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్‌కు గాయమైంది. సోమవారం సాయంత్రం ఆయన భుజానికి గాయమైనట్లు ఎన్టీఆర్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొన్నది. డాక్టర్ జె. మధుసూదన్ రావు, ఆర్. ఏ. పూర్ణ చంద్ర తేజస్వి నేతృత్వంలోని డాక్టర్ల బృందం ఆయనకు చికిత్సను అందిస్తున్నారని వెల్లడించింది. ఎన్టీఆర్ పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని డాక్టర్లు సూచించారని, అభిమానులు ఎవరూ ఆందోళన చెందొద్దని ఆ ప్రకటనలో కోరారు. ఎన్టీఆర్ ఆరోగ్యం తాలూకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అధికారికంగా తెలియజేస్తామని ఆయన కార్యాలయం పేర్కొన్నది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.



# ఇది కదా ఆడియన్స్‌కు కావాల్సింది..

ఈసారి హౌస్ లోకి ఎవరు ఎవరు వెళ్లనున్నారు అనేది ఆసక్తికరంగా మారింది. అయితే ఈసారి బిగ్ బాస్ హౌస్‌లోకి వెళ్ళేది వీరే అని కొన్ని పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఈసారి బిగ్ బాస్ హౌస్ లోకి చాలా మంది తెలిసిన మొఖాలే వెళ్తున్నాయని తెలుస్తుంది. సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పేర్ల ప్రకారం. ఎక్స్ ప్రెస్ హరి, తేజస్వి, మంగ్లీ, యాంకర్ నిఖిల్, ఇన్‌ఫ్లూయెన్సర్ నందు, రమణ, నటుడు ప్రభాకర్ లేదా ఆయన కుమారుడు వంటి వారు రాబోతున్నట్టు ప్రచారం జరుగుతుంది. వీరితో పాటు ఓ నటి కూడా హౌస్ లోకి ఎంట్రీ ఇస్తుందని తెలుస్తుంది. ఇండస్ట్రీలో ఆమె క్రేజీ నటి. సోషల్ మీడియాలో మంచి క్రేజ్ తెచ్చుకుంది. అలాగే పలు షార్ట్ ఫిలిమ్స్ లో నటించి మెప్పించింది. నెట్టింట ఈ అమ్మడికి మంచి క్రేజ్ ఉంది. పలు సినిమాల్లో కీలక పాత్రల్లో నటించి ఆకట్టుకుంది. ఆమె ఎవరో కాదు నటి సోనియా సింగ్. సోనియా సింగ్ చాలా మంది తెలిసిన పేరే.. ఈ అమ్మడు చాలా షార్ట్ ఫిలిమ్స్ లో నటించింది. తన ప్రియుడు సిద్ధూతో కలిసి ఆమె చాలా షార్ట్ ఫిలిమ్స్ లో నటించింది. అలాగే సాయి ధరమ్ తేజ్ హీరోగా నటించిన విరూపాక్ష సినిమాలో కీలక పాత్రలో నటించి మెప్పించింది. ఈ సినిమాతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. అలాగే మరికొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లోనూ నటించింది. ఇటీవలే నాగబంధం సినిమాలో నటించింది. ఇక ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ బిగ్ బాస్ 10లోకి అడుగుపెట్టనుంది టాక్ వినిపిస్తుంది.

# అప్పుడే అయిపోయిందా.. అనిల్ రావిపూడి దూకుడు



ఇదెక్కడి స్పీడ్ సామీ.. వందేభారత్ కంటే వేగంగా ఉన్నావుగా అంటున్నారు అనిల్ రావిపూడిని చూసి అభిమానులు..! తాను తెరకెక్కిస్తున్న మల్టీస్టారర్ గురించి అదిరిపోయే సర్‌ప్రైజ్ ఇచ్చారు ఈ దర్శకుడు. ఈ ప్రాజెక్ట్ ఇలా మొదలైందో లేదో అప్పుడే ఫ్యాన్స్‌కు కిక్ ఇచ్చే న్యూస్ చెప్పారు అనిల్ రావిపూడి. మరి అదేంటో క్లారిటీగా చూద్దామా..? షూటింగ్ మొదలుపెట్టే వరకే కాస్త స్లో.. ఒక్కసారి స్టార్ట్ అయ్యాక జెట్ స్పీడ్ అందుకుంటారు అనిల్ రావిపూడి. వెంకటేష్, కళ్యాణ్‌రామ్ హీరోలుగా ఆయన చేస్తున్న మల్టీస్టారర్ షూట్ వేగంగా జరుగుతుంది. తాజాగా ఫస్ట్ షెడ్యూల్ అయిపోయింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి కావాల్సినంత ప్రమోషనల్ స్టఫ్ విడుదల చేసారు అనిల్. పటాస్ తర్వాత పదేళ్లు గ్యాప్ తీసుకుని కళ్యాణ్ రామ్‌తో మరోసారి వర్క్ చేస్తున్నారు అనిల్. ఇందులో వెంకీతో సమానమైన రోల్ చేస్తున్నారీయన. వెంకటేష్‌కు జోడీగా కీర్తి సురేష్ నటిస్తుంటే.. కళ్యాణ్ రామ్‌కు జోడీగా కృతి శెట్టిని తీసుకున్నారు. రాయలసీమ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతుంది ఈ చిత్రం. జూన్ 22కు రెగ్యులర్ షూట్ మొదలైంది.. అప్పుడే ఫస్ట్ షెడ్యూల్ పూర్తైంది. కొన్నేళ్లుగా బాక్సాఫీస్ దగ్గర సంక్రాంతి అల్లుడిగా మారిన అనిల్.. ఈసారి అదే చేయాలని చూస్తున్నారు. వెంకీ, కళ్యాణ్ రామ్ సినిమాపై అంచనాలైతే మామూలుగా లేవు. అక్టోబర్ నాటికి షూట్ పూర్తి చేసి.. సంక్రాంతి విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి అనిల్ రావిపూడి ఈసారి ఎలాంటి సంచలనంతో రాబోతున్నారో చూడాలి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**